అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

గురువారం 16, జూలై 2026 | సంపుటి : 03 | సంచిక : 149 | పేజీలు : 05 | వెల ₹5


భూ సమస్యల పరిష్కారానికే

# సమగ్ర భూ సర్వే

- సాగు చేస్తున్న వాస్తవ రైతులకే పట్టాలు, పాస్ పుస్తకాలు అందించాలి
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

3





## అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత

పోలీస్ కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్ సెంటర్ల ఆకస్మిక తనిఖీ

2



## మరింత వేగవంతం చేయాలి

- ఈ నెలాఖరులోగా భూముల రీ సర్వే, పేపర్ వర్క్ ముగించాలి
- హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్ రవి
- సర్వే పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం

3

**అక్షరదర్బార్, వరంగల్:**

వరంగల్ మహానగరానికి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెబుతున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ భద్రకాళి దేవస్థానంలో బుధవారం శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్ఛారణలు, హోమాలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో శోభిల్లాయి. ఉదయం 4:30 గంటలకు నిత్యాహ్నిక కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం అమ్మవారికి ఉత్సవానుజ్ఞ ప్రార్థన నిర్వహించి, సంప్రదాయబద్ధంగా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఉత్సవ పూర్వాంగ విధులను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



# 'శాకంబరీ' దేవి నవరాత్రి వైభవం



### ఘనంగా భద్రకాళి శాకాంబరీ ఉత్సవాలు ప్రారంభం

భద్రకాళీ అమ్మవారికి 1008 కలశాలతో 'సహస్ర కలశాభిషేకం'

జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని దంపతులు

హోమాలు, ప్రత్యేక అర్చనలతో ఆధ్యాత్మిక జలధారగా మారిన ఓరుగల్లు క్షేత్రం

దర్శించుకుని తరించిన భక్తజనం. తల్లికి భక్తిపూర్వక నీరాజనాలు

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ కావ్య

2

# యువకుడి దారుణ హత్య



- హైదరాబాద్ మాదాపూర్ లో ఘటన
- కత్తులతో పొడిచి చంపిన హంతకులు
- మృతుడు వరంగల్ జిల్లా ఉప్పరపల్లి వాసి
- పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితులు!

2

# వరంగల్ ఆడబిడ్డ సినిమాను గెలిపించాలి

- మాజీ కూడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్
- మాస్టర్ జీ డిగ్రీ, పీజీ కళాశాలలో 'వెంకట్రామయ్య గారి తాలూకా' మూవీ గ్రాండ్ ప్రమోషన్
- విద్యార్థుల కేరింతల నడుమ ట్రైలర్, సాంగ్స్ విడుదల
- 17న రాష్ట్రవ్యాప్తంగా 60 థియేటర్లలో విడుదల

2



# 'శాకంబరీ' దేవి నవరాత్రి వైభవం

## ఘనంగా భద్రకాళి శాకాంబరీ ఉత్సవాలు ప్రారంభం

- భద్రకాళీ అమ్మవారికి 1008 కలశాలతో 'సహస్ర కలశాభిషేకం'
- జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని దంపతులు
- హోమాలు, ప్రత్యేక అర్చనలతో ఆధ్యాత్మిక జలధారగా మారిన ఓరుగల్లు క్షేత్రం
- దర్శించుకుని తరించిన భక్తజనం. తల్లికి భక్తిపూర్వక నీరాజనాలు
- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ కావ్య

**అక్షరదర్బార్, వరంగల్:**

వరంగల్ మహానగరానికి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెబుతున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ భద్రకాళీ దేవస్థానంలో బుధవారం శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్చారణలు, హోమాలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో శోభిల్లాయి. ఉదయం 4:30 గంటలకు నిత్యాహ్నిక కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం అమ్మవారికి ఉత్సవానుజ్ఞ ప్రార్థన నిర్వహించి, సంప్రదాయబద్ధంగా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఉత్సవ పూర్వాంగ విధులను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



### జ్యోతి ప్రజ్వలనతో దీప్తుల వెలుగులు

ఉదయం 10 గంటలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి – నీలిమ దంపతులు భద్రకాళీ ఆలయానికి చేరుకున్నారు. వారికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) రామల సునీత, ప్రధాన అర్చకులు శేషు పూజాకుంభ స్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు, ఆ తర్వాత జ్యోతి ప్రజ్వలన చేసి శాకంబరీ నవరాత్రి మహోత్సవాలను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య కూడా భద్రకాళి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఎంపీ అమ్మవారి సన్నిధిలో తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### కనులపండువగా 1008 కలశాభిషేకం

మహోత్సవాల్లో భాగంగా అర్చకులు సహస్ర కలశాభిషేకానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసి, గ్రహమఖం, మూలమంత్ర హోమం, శాంతి హోమం నిర్వహించారు. అనంతరం జగన్మాతకు సుమారు రెండు గంటల పాటు 1008 పవిత్ర కలశాలతో సహస్ర కలశాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ అభిషేకాన్ని తిలకించిన భక్తులు భక్తి పరవశంతో మునిగిపోయి దివ్యానుభూతిని పొందారు. అభిషేకం అనంతరం అమ్మవారి పీఠంలో ఎదురుగా ఉన్న భైరవాన్ని కాశీదూతగా, మహామండపంలోని భైరవాన్ని కామేశ్వరీ మాతగా ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

### ఆధ్యాత్మిక శోభితం.. భద్రగిరి ప్రస్థానం

ఈ మహోత్సవాలకు వ్యాపార, సామాజిక, ఆధ్యాత్మిక రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు వందలాది మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల రద్దీతో శ్రీ భద్రకాళీ దేవస్థానం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామల సునీత మాట్లాడుతూ.. "శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు ప్రతిరోజూ శాస్త్రోక్తంగా నిర్వహించబడతాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



### సీపీని కలిసిన ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ ప్రతినిధులు

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేతను బుధవారం ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఓరుగంటి లైలా, సలహాదారు ఈవీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సంక్షేమం, భద్రత, ఉపాధి అవకాశాలు, విద్య, ఆరోగ్యం, సమాజంలో గౌరవప్రదమైన జీవనం కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్‌లకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, చట్టబద్ధమైన రక్షణతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సలహాదారు ఈవీ శ్రీనివాస్ రావు, సభ్యులు రింషా, పూర్ణిమ పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత
- పోలీస్ కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్ సెంటర్ల ఆకస్మిక తనిఖీ

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో భద్రత, నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత కీలక చర్యలు చేపట్టారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలోని పోలీస్ కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్ రూంలను సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూం సిబ్బంది పనితీరు, అత్యవసర కాల్స్ స్వీకరణ విధానం, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, నగరంలోని వివిధ ప్రాంతాలపై నిఘా, సాంకేతిక వ్యవస్థల పనితీరును కమిషనర్ సమీక్షించారు. ప్రజలకు అత్యవసర సేవలు మరింత వేగవంతంగా అందేలా కంట్రోల్ రూం సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ రూంలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణ, ట్రాఫిక్ పర్యవేక్షణ, శాంతిభద్రతల నిర్వహణలో మరింత సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ కమిషనర్ వెంట అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, శ్రీనివాస్, ఏసీపీ జితేందర్ రెడ్డి, ఆర్ఐ సతీష్, క్లూస్ ఇన్ స్పెక్టర్ రాజ్ కుమార్, ఎస్ఐ రోహిత్, ఆర్ఎస్ఐ శ్రవణ్ కుమార్ ఉన్నారు.



# రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

- మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో కలలు సాకారం
- బీఆర్ఎస్, బీజేపీలు మోసం చేశాయి.. రెండున్నరేళ్లలోనే చేసి చూపాం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడి
- బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటుందని కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం బాణాసంచా పేల్చి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### మాటల్లో కాదు.. చేతల్లో చూపించాం.. నాయిని

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అభివృద్ధి ఊపందుకుందని అన్నారు. "అభివృద్ధి అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే అభివృద్ధి" అనే మాటను ప్రభుత్వం చేతల్లో నిరూపిస్తోందన్నారు. వరంగల్ జిల్లాలో దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ప్రాజెక్టులను వరుసగా అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టుకుందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు ఎన్నికల సమయంలో వరంగల్ ప్రజలకు మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు వంటి అనేక హామీలు ఇచ్చి.. పదేళ్లపాటు ఒక్క హామీని కూడా అమలు చేయకుండా మోసం చేశారని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజల ఆశలను కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే వాడుకున్నారని ఆరోపించారు.

– రూ.300 కోట్లతో మామునూరు భూసేకరణ పూర్తి

"దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలకు భూసేకరణ జరపాలని కేంద్రం సూచించినా, వరంగల్ విమానాశ్రయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి రూ.300 కోట్లు కేటాయించి భూసేకరణ పూర్తి చేసింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఆలస్యమైందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కూడా స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు 2028 జూన్ 2 నాటికి మామునూరు విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు." అని నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.

### రూ.5,300 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ

వరంగల్ నగర రూపురేఖలను మార్చే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు సుమారు రూ.5,300 కోట్లతో ఈ నెలాఖరులోనే టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపుతో ఈ చారిత్రాత్మక ప్రాజెక్టును చేపట్టిందన్నారు.

### చేతనైతే కాజీపేట రైల్వే డివిజన్ సాధించండి..

అభివృద్ధిని అడ్డుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు నిరాధారమైన అవినీతి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. దమ్ముంటే ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి నిజంగా వరంగల్‌పై చిత్తశుద్ధి ఉంటే.. కాజీపేట రైల్వే డివిజన్ సాధించి చూపాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రతినిధులమంతా సమన్వయంతో పనిచేస్తూ, వరంగల్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు,

# భూ సమస్యల పరిష్కారానికే సమగ్ర భూ సర్వే

- సాగు చేస్తున్న వాస్తవ రైతులకే పట్టాలు, పాస్ పుస్తకాలు అందించాలి
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అక్షరదర్బార్, భూపాలపల్లి: గ్రామాల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే సమగ్ర భూ సర్వే అత్యంత ఆవశ్యకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని ఎస్ఎం కొత్తపల్లి గ్రామంలో భూ సర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామాల్లో భూములు సాగు చేసుకుంటున్నది ఒకరైతే, పట్టా పాస్ పుస్తకాలు మరొకరి పేరుపై ఉండటం వల్ల రైతులు అనేక న్యాయపరమైన, ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సమస్యలకు చెక్ పెట్టడానికే ప్రభుత్వం సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు.



### పారదర్శకంగా సర్వే - అర్హులకే పట్టాలు

ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ, గ్రామ ప్రజలను భాగస్వామ్యం చేసి అత్యంత పారదర్శకంగా భూ సర్వే నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. "వాస్తవంగా భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులను గుర్తించాలి. నిబంధనల ప్రకారం వారికే భూమిపై పూర్తి హక్కులు కల్పిస్తూ కొత్తగా పట్టాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేలా రెవెన్యూ యంత్రాంగం త్వరితగతిన చర్యలు చేపట్టాలి." అని అధికారులను ఆదేశించారు.

### ఆక్రమణల గుర్తింపు - ప్రభుత్వ భూముల పరిరక్షణ

రెవెన్యూ భూములు, గ్రామకంఠం స్థలాలు, ప్రభుత్వ భూములపై ఉన్న ఆక్రమణలను గుర్తించేందుకు ఈ భూ సర్వే ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సర్వే ద్వారా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను పక్కాగా గుర్తించి, వాటిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడం సులభతరమవుతుందని తెలిపారు.

### - పాస్ పుస్తకాలతోనే రైతు సంక్షేమ పథకాలు

రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అత్యంత కీలకమైన ఆయుధమని ఎమ్మెల్యే గండ్ర గుర్తుచేశారు. చేతిలో పాస్ పుస్తకాలు ఉంటేనే రైతులకు పంట రుణాలు లభిస్తాయని, అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇతర రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్క రైతుకూ పాస్ పుస్తకాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.


# మరింత వేగవంతం చేయాలి

- ఈ నెలాఖరులోగా భూముల రీ సర్వే, పేపర్ వర్క్ ముగించాలి
- హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్ రవి
- సర్వే పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం

అక్షరదర్బార్, హనుమకొండ: జిల్లాలో భూముల రీ సర్వేకు ఎంపిక చేసిన గ్రామాల్లో పనులను మరింత వేగవంతం చేయాలని, ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయి సర్వేతో పాటు దానికి సంబంధించిన పేపర్‌వర్క్‌ను పూర్తిగా ముగించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి ప్రభుత్వ సర్వేయర్లను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రీ సర్వే పురోగతిపై భూముల కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, ప్రభుత్వ సర్వేయర్లతో అదనపు కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

### గడువులోగా పూర్తి చేయాలి

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్ రవి మాట్లాడుతూ, రీ సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు వీలుగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. "పనుల వేగవంతం కోసం అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలి. క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేకు సంబంధించిన నివేదికలను, రికార్డులను సర్వే బృందాలు సకాలంలో ఉన్నతాధికారులకు సమర్పించాలి." రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చూసుకోవాలని, ప్రతి రోజు ఉదయాన్నే సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో గ్రామాలకు చేరుకుని పనులను ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



### అందరి సహకారం తీసుకోవాలి

గ్రామాల్లో భూముల రీ సర్వే ఎలాంటి వివాదాలు లేకుండా, విజయవంతంగా సాగాలంటే స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారుల సహకారాన్ని సర్వేయర్లు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వచ్చే చిన్నపాటి సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకుంటూ సర్వేను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు సారంగపాణి, రాజనర్సయ్య, జిల్లా ప్రభుత్వ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీలు

- ప్రారంభించనున్న టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్ పోటీల్లో తలపడనున్న విద్యుత్ ఉద్యోగులు

**అక్షరదర్బార్, హనుమకొండ:**

తెలంగాణ ట్రాన్స్‌కో, టీజీఎన్‌పీడీసీఎల్, టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 2026–27 సంవత్సరానికి సంబంధించిన ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ (జేఎన్ఎస్) స్టేడియంలో ఈ నెల 18 వరకు మూడు రోజుల పాటు వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, క్యారమ్ క్రీడా పోటీలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు హనుమకొండ ఆపరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ బి సామ్య నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

– ఉదయం 9 గంటలకు గ్రాండ్ ఓపెనింగ్

ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీఎన్‌పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కర్నాటి వరుణ్ రెడ్డి హాజరై, క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లు వి మోహన్ రావు (ప్రాజెక్ట్స్), టి మధుసూదన్ (ఆపరేషన్స్), సి ప్రభాకర్ (హెచ్ఆర్‌డీ), వి తిరుపతి రెడ్డి (ఫైనాన్స్) లు విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. ఈ క్రీడా వేడుకల విజయవంతం కోసం స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులుగా వరంగల్ ఎస్ఈ ఎ ఆనందం, జనగామ ఎస్ఈ సీహెచ్ సంపత్ రెడ్డి, మహబూబాబాద్ ఎస్ఈ పి విజయేందర్ రెడ్డి, భూపాలపల్లి ఎస్ఈ ఎ రమేష్, ములుగు ఎస్ఈ బి భిక్షపతిలతో పాటు కన్వీనర్ కే దర్శన్ కుమార్, సభ్యులు యాకుబ్ బాషా, ప్రేమ్ కుమార్ లు ప్రత్యేక ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

### 18న ముగింపు వేడుకలు

మూడు రోజుల పాటు అత్యంత ఉత్సాహభరితంగా సాగనున్న ఈ పోటీల ముగింపు వేడుకలు జూలై 18న మధ్యాహ్నం 12 గంటలకు జరగనున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు, ట్రోఫీలను ప్రదానం చేయనున్నారు. ఈ పోటీలలో తెలంగాణ ట్రాన్స్‌కో, టీజీఎన్‌పీడీసీఎల్, టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని వివిధ సర్కిళ్లకు చెందిన విద్యుత్ ఉద్యోగులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించనున్నారు.

# యువకుడి దారుణ హత్య

- హైదరాబాద్ మాదాపూర్ లో ఘటన
- కత్తులతో పొడిచి చంపిన హంతకులు
- మృతుడు వరంగల్ జిల్లా ఉప్పరపల్లి వాసి
- పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితులు!

అక్షరదర్బార్, వర్ధన్నపేట: హైదరాబాద్ ఐటీ హబ్ నడిబొడ్డున జరిగిన హత్య కలకలం సృష్టించింది. మాదాపూర్‌లోని ప్రముఖ 'ది రామేశ్వరం కేఫ్' ముందు బుధవారం ఒక యువకుడిని దుండగులు కత్తులతో వేటాడి దారుణంగా పొడిచి చంపారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో జనం చూస్తుండగానే ఈ ఘాతుకం జరగడం స్థానికంగా తీవ్ర భయాందోళనలు రేకెత్తించింది. తీవ్ర రక్తస్రావంతో బాధితుడు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చిన్నపల్లి భాస్కర్(30)గా పోలీసులు గుర్తించారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. ఈ హత్యకు ఓ యువతితో ప్రేమ వ్యవహారమే కారణమని తెలిసింది. మృతుడు భాస్కర్ తన స్వగ్రామంలోని ఓ యువతిని ప్రేమించినట్లు సమాచారం. వ్యతిరేకించిన యువతి కుటుంబ సభ్యులకు, భాస్కర్‌కు మధ్య గతంలో వాగ్వాదం జరిగినట్లు తెలిసింది.

### వరంగల్ నుంచి స్కెచ్.. పక్కా ప్లాన్‌తో వచ్చి..

అవమానంగా భావించిన యువతి తండ్రి రాజు.. ఎలాగైనా భాస్కర్ ను అంతమొందించాలని నిశ్చయించుకున్నాడు. ఇందుకోసం తన బంధువైన కుమారస్వామితో కలిసి పక్కా స్కెచ్ వేశాడు. ఇద్దరూ కలిసి వరంగల్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. మాదాపూర్ రామేశ్వరం కేఫ్ సమీపంలో ఉన్న భాస్కర్‌ను టార్గెట్ చేసి, తమ వెంట తెచ్చుకున్న కత్తులతో ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. ప్రాణాలు కాపాడుకోవడానికి భాస్కర్ పరుగులు తీసినా వదలకుండా వెంటాడి పొడిచి చంపారు.

### స్టేషన్‌లో లొంగిపోయిన నిందితులు

హత్యాయత్నం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే తీవ్రమైన గాయాలు కావడంతో భాస్కర్ అప్పటికే మృతి చెందాడు. కాగా, హత్య చేసిన అనంతరం నిందితులు రాజు, కుమారస్వామి ఇద్దరూ నేరుగా వెళ్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యువకుడు భాస్కర్ హత్యను నిరసిస్తూ దళిత సంఘాలు ఉప్పరపల్లిలో రాస్తారోకో నిర్వహించాయి. భాస్కర్ మృతదేహం రాత్రి ఉప్పరపల్లి గ్రామానికి చేరుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకున్నట్లు తెలిసింది.



# వరంగల్ ఆడబిడ్డ సినిమాను గెలిపించాలి

- మాజీ కూడా ఛైర్మన్ సుందర్ రాజ్ యాదవ్
- మాస్టర్ జీ డిగ్రీ, పీజీ కళాశాలలో 'వెంకట్రామయ్య గారి తాలూకా' మూవీ గ్రాండ్ ప్రమోషన్
- విద్యార్థుల కేరింతల నడుమ ట్రైలర్, సాంగ్స్ విడుదల
- 17న రాష్ట్రవ్యాప్తంగా 60 థియేటర్లలో విడుదల

అక్షరదర్బార్, హనుమకొండ: తల్లిదండ్రుల ఆశయాలు, రైతు కష్టం, భూమి విలువ నేపథ్యంతో వరంగల్ ఆడబిడ్డ నిర్మించిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' సినిమాను ప్రేక్షకులందరూ ఆదరించి విజయవంతం చేయాలని మాజీ కూడా ఛైర్మన్, ఓబీసీ ఛైర్మన్ ఎస్ సుందర్ రాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని మాస్టర్ జీ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో పలువురు సామాజికవేత్తలు, ప్రొఫెసర్లు, విద్యార్థుల కేరింతల నడుమ సినిమా ట్రైలర్, సాంగ్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత, వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం జానకిపురం గ్రామానికి చెందిన ఆడబిడ్డ కోమలి మహేందర్‌ను సుందర్ రాజ్ యాదవ్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.

### తండ్రి ఆవేదన, రైతు కష్టమే ఈ సినిమా కథ

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ... "సారంగదరియా జానపద పాట ద్వారా గుర్తింపు తెచ్చుకున్న స్థానిక కళాకారిణి కోమలి, ఇంతటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని ఒక మంచి కుటుంబ కథా చిత్రాన్ని నిర్మించడం వరంగల్ జిల్లాకే గర్వకారణం. పిల్లల భవిష్యత్తు కోసం తపించే ఒక తండ్రి ఆరాటం, రైతు పడే కష్టం, నేల తల్లి విలువను ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్లి ఈ సినిమాను చూడాలి."

### 17న 60 థియేటర్లలో గ్రాండ్ రిలీజ్..

### నిర్మాత కోమలి

చిత్ర నిర్మాత కోమలి మహేందర్ మాట్లాడుతూ... "కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా, ఎన్నో సవాళ్లను దాటుకుని ఈ సినిమాను నిర్మించాను. ఒక ఆడపిల్ల కన్నీటి కథ, తండ్రి పడే ఆవేదన, ఒక అందమైన ప్రేమకథ సమాహారమే ఈ చిత్రం. ప్రతి ఒక్క కుటుంబం గర్వంగా చూడదగ్గ సినిమా ఇది. ఈ నెల 17న తెలంగాణ వ్యాప్తంగా 60 థియేటర్లలో ఈ సినిమా విడుదలవుతోంది. హనుమకొండలోని శ్రీదేవి ఏషియన్ మాల్, కాజీపేట భవాని థియేటర్లలో కూడా ఈ చిత్రం ప్రదర్శితం కానుంది. వరంగల్ ఆడబిడ్డగా నన్ను, నా తొలి ప్రయత్నాన్ని మీరంతా దీవించి గెలిపించాలని కోరుకుంటున్నాను." తన సినిమా ప్రమోషన్‌కు వేదికగా నిలిచి, అండగా నిలబడిన సుందర్ రాజ్ యాదవ్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గ్రాండ్ ప్రమోషన్ కార్యక్రమంలో అచ్యుత్ రాజ్ (జనరల్ సెక్రెటరీ, మాస్టర్ జీ విద్యాసంస్థలు), ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ (ఓబీసీ ప్రధాన కార్యదర్శి), బోనగాని యాదగిరి గౌడ్ (తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు), గంగాపురం వేణు మాధవ్ గౌడ్(ప్రైవేట్ లెక్చరర్స్ ఫోరమ్ అధ్యక్షుడు), చిగుమళ్ల మౌనిక (ఓబీసీ సభ్యురాలు), బండా వివేకానంద (ప్రముఖ అడ్వకేట్), గుండా శ్రీనివాస్ (పారిశ్రామికవేత్త)తో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.